# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people


# ఈఎస్ పై 'ఏసీబీ' పంజా

అదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు

- ఏకకాలంలో 11 చోట్ల సోదాలు
- రూ.కోట్ల డాక్యుమెంట్ విలువైన ఆస్తులు గుర్తింపు

02




బుధవారం, 24, జూన్ 2026 | సంపుటి : 03 | సంచిక : 132 | పేజీలు : 05 | వెల ₹5





## మైనర్లకు వాహనమివ్వొద్దు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: మైనర్లకు వాహనం ఇచ్చి వారి కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని చట్టపరమైన చిక్కుల్లో పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పోలీసు అధికారి నిరంతరం కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం, కార్యక్రమాలను నిర్వహిస్తున్నా కొంత మంది వాహనదారుల బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ రోడ్డు ప్రమాదాలు అధికంగా మైనర్ వాహనదారుల కారణంగా అధికంగా జరుగుతున్నాయని, రెండు రోజుల క్రితం పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధులతో పాటు, ఒక మైనర్ బాలుడు మరణించగా, మరో మైనర్ బాలుడు తీవ్ర గాయలతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని ఆయన తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణం మైనర్ బాలుడు అతి వేగంగా వాహనం నడుపటమేనని, ఇద్దరు వృద్ధులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీ కొట్టడం కారణంగానే సంఘటన స్థలంలో మైనర్ బాలుడితో పాటు ఏ పాపం ఎరుగని ఇద్దరు వృద్ధులు మరణించారని వివరించారు. ఈ సంఘటన చాలా బాధకరమైన విషయం. ఇది ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని సీపీ పేర్కొన్నారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ముఖ్యంగా మైనర్లకు వాహనం అందజేయడం చట్టరీత్యా నేరమని, ఇలా మైనర్లకు వాహనం అందజేయడం ద్వారా మైనర్ల డ్రైవింగ్ కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని లేదా మైనర్ తల్లిదండ్రులనూ బాధ్యులుగా చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో వారిని జైలులు తరలించడం కూడా జరుగుతుందని సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. ఇకనైన వాహనదారులు మైనర్ డ్రైవర్లకు వాహనాలు అందజేయడం లేదా వారిని ప్రోత్సహించవద్దని సీపీ హితవు చెప్పారు.

# ఉపాధి హామీలో 'మామూళ్ల' దందా!

## కూలీల పొట్టగొడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది




- రూ.100 ఇస్తేనే మస్టర్లు, కొలతలు
- డబ్బులు ఇవ్వని వారిపై వివక్ష..
- వేతనాల్లో కోత
- మొగుళ్లపల్లి మండలంలో వెలుగుచూసిన వసూళ్ల పర్వం
- పట్టించుకోని ఉన్నతాధికారులు.. ఆవేదనలో కూలీలు.

02

గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' మొగుళ్లపల్లి మండలంలో అక్రమార్కులకు కామధేనువులా మారింది. ప్రతి కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల పాటు వేతనంతో కూడిన పనిని కల్పించే ఈ చట్టబద్ధమైన సామాజిక భద్రతా పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కూలీల శ్రమను దోచుకుంటూ, వారి పొట్టగొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని 26 గ్రామాల్లో ఉపాధి హామీ పనుల నిర్వహణలో కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పనుల వద్దకు వచ్చి మస్టర్లు వేయడానికి, కొత్తగా పేర్లు నమోదు చేయడానికి, చేసిన పనికి సంబంధించిన కొలతలను అంతర్జాలంలో (ఆన్‌లైన్) నమోదు చేయడానికి, చివరకు సాంకేతిక సహాయకులకు (టీఏ) 'మామూళ్లు' ఇవ్వాలంటూ కూలీలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందుకోసం వారానికి ఒక్కో కూలీ నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

-అక్షరదర్బార్, మొగుళ్లపల్లి

## ఏసీబీ వలలో ఎస్సై

- స్టేషన్ బెయిల్ ఇవ్వటానికి రూ.లక్ష డిమాండ్
- తొలి విడత రూ.50 వేలు తీసుకుంటూ అడ్డంగా బుక్



02



## ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలి
- రేపటి నుంచి వచ్చే నెల 24 వరకు బీఎల్వోల ఇంటింటి సర్వే
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ

02

## బీఆర్ఎస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- పోచంపల్లి, కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు

03



# ఏసీబీ వలలో ఎస్సై

### స్టేషన్ బెయిల్ ఇవ్వటానికి రూ.లక్ష డిమాండ్

### తొలి విడత రూ.50 వేలు తీసుకుంటూ అడ్డంగా బుక్



అక్షరదర్బార్, హైదరాబాద్ : స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి, భవిష్యత్తులో వేధించకుండా ఉండడానికి ఓ ఫిర్యాదుదారుడి నుండి రూ.లక్ష లంచం డిమాండ్ చేసిన హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గాంధీనగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) వి నరసింహులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వి నరసింహులు ఒక కేసులో ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు (స్టేషన్ బెయిల్ మంజూరు చేయడానికి, ఇకపై వేధించకుండా ఉండడానికి) రూ.1,00,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడు అంత మొత్తం ఇచ్చుకోలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

**పథకం ప్రకారం పట్టుకున్న అధికారులు**

మంగళవారం సాయంత్రం సుమారు 5:30 గంటల ప్రాంతంలో ఎస్ఐ నరసింహులు తన కార్యాలయంలో బాధితుడి నుండి లంచం మొత్తంలో మొదటి విడతగా రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి రంగులద్దిన నోట్లతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు చూపిన గుర్తుల ఆధారంగా లంచం సొమ్ము రూ.50 వేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సదరు అధికారి అక్రమ ప్రయోజనం కోసం తన విధులను పక్కనబెట్టి, అవినీతి మార్గంలో ప్రవర్తించారని ఏసీబీ స్పష్టం చేసింది.

**నర్సింహులు అరెస్ట్**

లంచం తీసుకుంటూ దొరికిపోయిన సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహులును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి ప్రస్తుతం దర్యాప్తు జరుపుతున్నామని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచామని అధికారులు వెల్లడించారు.

# ఈఎస్ పై 'ఏసీబీ' పంజా

### అదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు

### ఏకకాలంలో 11 చోట్ల సోదాలు

### రూ.కోట్ల డాక్యుమెంట్ విలువైన ఆస్తులు గుర్తింపు

అక్షరదర్బార్, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) కొమ్ముర్రి మల్లారెడ్డి అక్రమాస్తుల గుట్టును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రట్టు చేసింది. తన సర్వీసు కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి, అవినీతి అక్రమార్జనతో ఆదాయ వనరులకు మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదైంది. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, మంగళవారం ఉదయం నుంచే సోదాలు చేపట్టారు. మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, ఇతర ముఖ్య సహచరులకు చెందిన మొత్తం 11 ప్రదేశాలలో ఏకకాలంలో ఈ తనిఖీలు నిర్వహించారు.

**సోదాల్లో దొరికిన ఆస్తుల కొండ**

ఏసీబీ అధికారులు జరిపిన ప్రాథమిక సోదాలలోనే కోట్ల విలువైన స్థిరాస్తులు, నగదు బయటపడ్డాయి. దస్తావేజుల ప్రకారం వీటి విలువ సుమారు రూ.3 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్లో వీటి విలువ చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. 4 నివాస గృహాలు, 1 కమర్షియల్ బ్లాక్‌తో కలిపి మొత్తం 5 భారీ నిర్మాణాలు, వివిధ ప్రాంతాల్లో 8 ఓపెన్ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.3,31,000ల నగదుతో పాటు, ఏకంగా రూ.50 లక్షల బ్యాంకు నిల్వలను గుర్తించారు. నిందితుడి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న 3 బ్యాంక్ లాకర్లను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా వీటిని త్వరలోనే ఓపెన్ చేయనున్నారు. ఇంట్లో ఒక విలాసవంతమైన గ్రాండ్ విటారా కారు, ఒక టీవీఎస్ స్కూటీ లభించాయి. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉందని ఏసీబీ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.



# ఉపాధి హామీలో 'మామూళ్ల' దందా!

- కూలీల పొట్టగొడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- రూ.100 ఇస్తేనే మస్టర్లు, కొలతలు
- డబ్బులు ఇవ్వని వారిపై వివక్ష.. వేతనాల్లో కోత
- మొగుళ్లపల్లి మండలంలో వెలుగుచూసిన వసూళ్ల పర్వం
- పట్టించుకోని ఉన్నతాధికారులు.. ఆవేదనలో కూలీలు



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' మొగుళ్లపల్లి మండలంలో అక్రమార్కులకు కామధేనువులా మారింది. ప్రతి కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల పాటు వేతనంతో కూడిన పనిని కల్పించే ఈ చట్టబద్ధమైన సామాజిక భద్రతా పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కూలీల శ్రమను దోచుకుంటూ, వారి పొట్టగొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని 26 గ్రామాల్లో ఉపాధి హామీ పనుల నిర్వహణలో కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పనుల వద్దకు వచ్చి మస్టర్లు వేయడానికి, కొత్తగా పేర్లు నమోదు చేయడానికి, చేసిన పనికి సంబంధించిన కొలతలను అంతర్జాలంలో (ఆన్‌లైన్) నమోదు చేయడానికి, చివరకు సాంకేతిక సహాయకులకు (టీఏ) 'మామూళ్లు' ఇవ్వాలంటూ కూలీలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందుకోసం వారానికి ఒక్కో కూలీ నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

**డబ్బులు ఇవ్వకపోతే వివక్ష.. వేతనాల్లో కోత**

కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మరికొన్ని చోట్ల మేట్లు ఈ వసూళ్ల దందాను నడిపిస్తున్నారు. సాంకేతిక సహాయకులు సైతం పని ప్రదేశానికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన, కొలతలు వేయకుండా.. కార్యాలయాల్లో కూర్చొని ఇష్టారాజ్యంగా రికార్డులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**పారదర్శకత శూన్యం.. నిమ్మకు నీరెత్తిన అధికారులు**

ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందినప్పటికీ, వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారుల ఉదాసీనత వల్లే క్షేత్రస్థాయి సిబ్బంది మరింతగా రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పారదర్శకత పూర్తిగా లోపించడంతో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ఆశయానికి గండి పడుతోంది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలను తమ సొంత పనులకు వాడుకుంటూ వేలాది రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, మొగుళ్ళపల్లి మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

### అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలి

### రేపటి నుంచి వచ్చే నెల 24 వరకు బీఎల్వోల ఇంటింటి సర్వే

### అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ



అక్షరదర్బార్, వరంగల్: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటరు జాబితాను ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత సమగ్రంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ఆమె సూచించారు.

**క్షేత్రస్థాయిలో బీఎల్వోల సర్వే.. షెడ్యూల్ ఇదే**

ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన కీలక గడువులను కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. జూలై 31 ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, క్లెయిమ్స్-అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా అధికారిక ప్రచురణ. మూడు నియోజకవర్గాల్లో 799 పోలింగ్ కేంద్రాలు. వరంగల్ జిల్లా పరిధిలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల వ్యాప్తంగా మొత్తం 799 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణలో బీఎల్వోలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు.

**ప్రతి ఇంటికీ ముందస్తు ఫారాలు.. తాళం వేసి ఉంటే 3 సార్లు విజిట్**

ప్రస్తుతం ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోందని, ఇందుకోసం ప్రతి ఇంటికి ముందుగా ముద్రించిన 'ఎన్యుమరేషన్ ఫారాలను' రెండు ప్రతులుగా అందజేస్తారని కలెక్టర్ వివరించారు. వాటిని ఎలా పూరించాలో బీఎల్వోలు మార్గనిర్దేశం చేస్తారన్నారు. బీఎల్వోలు ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శిస్తారని.. ఒకవేళ ఏదైనా ఇంటికి తాళం వేసి ఉంటే, సదరు ఇంటిని మూడు సార్లు సందర్శించి వివరాలు సేకరిస్తారని స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన 'ద్వంద్వ ఓటర్లను' (డూప్లికేట్ ఓటర్లు) గుర్తించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుండి తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి బి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



# 29న వరంగల్ కు కేటీఆర్

అక్షరదర్బార్, వరంగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈనెల 29న వరంగల్ కు రానున్నారు. ఎస్ఐఆర్ పై వరంగల్ తూర్పు నియోజకవర్గం బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తల కోసం 29న అవగాహన సదస్సు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరగనుంది. వరంగల్ లో జరిగే ఈ సదస్సు, కార్యక్రమానికి కేటీఆర్ హాజరవుతారని మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ వెల్లడించారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 32 వ డివిజన్ పరిధిలో పర్యటించిన ఆయన కేటీఆర్ సభ ఏర్పాట్లలో భాగంగా జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు జరిగే ఎస్ఐఆర్ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, బీఎల్ఏలు చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ నగరానికి వచ్చిన కేటీఆర్ వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గం బీఎల్ఏలు, బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈసారి వరంగల్ తూర్పు నియోజకవర్గం సమావేశంలో పాల్గొనేందుకు కేటీఆర్ వరంగల్ కు రాబోతున్నారు.



## పరకాల రైతు వేదికలో
# విత్తన మేళా ప్రారంభం

- జూన్ 29 వరకు నాణ్యమైన విత్తనాల విక్రయం
- రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్న అధికారులు
- పంటల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

అక్షరదర్బార్, పరకాల: రైతులకు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పరకాల రైతు వేదికలో మంగళవారం విత్తన మేళాను ఘనంగా ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ వ్యవసాయ సంచాలకులు అధిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి, పత్తితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందేందుకు రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ విత్తన మేళా ఈ నెల 29 వరకు కొనసాగుతుందని, రైతులు తమ అవసరాలకు అను□□ణంగా వివిధ పంటల నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.



## పోచారంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

- రూ.10 వేల విలువైన విద్యా సామగ్రి అందజేత
- దాత గోవిందు కుమారస్వామిని అభినందించిన సర్పంచ్ మధూకర్
- చేతిరాత నైపుణ్యం పెంపొందేలా చూచిరాత కాపీల అందజేత

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం పోచారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచిత నోటు పుస్తకాలు, చూచిరాత కాపీలు, పెన్సిళ్లు, స్కేల్‌లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గోవిందు కుమారస్వామి రూ.10 వేల విలువైన విద్యా సామగ్రిని అందించగా, గ్రామ సర్పంచ్ పెంతల మధూకర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు చేతిరాత నైపుణ్యం పెంపొందేలా సామగ్రి అందించినట్లు తెలిపారు. సర్పంచ్ మధూకర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన పునాది అవసరమని, చేతిరాత అభివృద్ధికి చూచిరాత కాపీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ పాఠశాలకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తానని దాత హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోలపాక చందు, మాజీ సర్పంచ్ నీరటి అశోక్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులకు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- పోచంపల్లి, కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు




అక్షరదర్బార్,పరకాల: బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని కాపాడుకోవాలంటే గత పాలనలో చేసిన తప్పులను అంగీకరించి ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తీర్పు ఇచ్చినా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇంకా వాస్తవాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఎల్ఏ శిక్షణ కార్యక్రమాల కంటే కాంగ్రెస్ పార్టీ, నాయకులను విమర్శించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల విమర్శలు, ఆరోపణలు తమ పాలనలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ పాత్రను గుర్తు చేస్తూ, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఎక్కడ ఉందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 16 వేల కోట్ల రూపాయల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, ఆ పాలనలో కొందరు నాయకులే లబ్ధి పొందారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ అప్పుల భారం మోస్తూనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.
ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫామ్‌హౌస్ రైడ్ వ్యవహారంపై వచ్చిన ఆరోపణలకు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను వ్యక్తిగత నిధులతో నిర్మించినట్లుగా ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని, ప్రస్తుతం తాము మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల మద్దతుతోనే తాను రాజకీయాల్లో విజయం సాధించానని, డబ్బులతో రాజకీయాలు చేయలేదన్నారు.పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. పరకాల నియోజకవర్గంలో రౌడీయిజానికి తావు లేదని, ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పాలన కొనసాగిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాతే వాటి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు విశ్వసనీయత కోల్పోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగురి బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# పోచంపల్లి వ్యాఖ్యలకు నిరసన

**దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నేతలు**

**ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్**

**టెక్స్ టైల్ పార్క్‌పై బహిరంగ చర్చకు సిద్ధమన్న మల్లారెడ్డి**

అక్షరదర్బార్, నడికూడ: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నడికూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్నెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, రాజకీయ దుష్ప్రచారమేనని విమర్శించారు. టెక్స్ టైల్ పార్క్ టెండర్ల విషయంలో కమిషన్లు తీసుకున్నారన్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో టెక్స్టైల్ పార్క్ భూసేకరణ, రైతుల పరిహారం, భూముల కేటాయింపులపై జరిగిన వ్యవహారాలకు సమాధానం చెప్పాల్సింది బీఆర్ఎస్ నాయకులేనని అన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాయకత్వంలో టెక్స్టైల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, విద్య, వైద్య సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## మహాదేవపూర్‌లో ఏబీవీపీ పాఠశాలల బంద్ విజయవంతం

- ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టేలా ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్
- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పేట సాయి

అక్షరదర్బార్, మహాదేవపూర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాఠశాలల బంద్ మహాదేవపూర్ మండలంలో విజయవంతమైందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పేట సాయి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, శ్రీకాంత్, గణేష్, సుశాంత్, శివ, కార్తీక్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా సవరణకు సన్నద్ధం కావాలి

- తహసీల్దార్లతో పరకాల ఆర్‌డీవో డీఎస్ వెంకన్న సమీక్ష
- పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశం
- జూన్ 25 నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ



అక్షరదర్బార్, పరకాల: జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పరకాల ఆర్డీఓ డీఎస్ వెంకన్న సూచించారు. మంగళవారం తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం భూ భారతి, సదాబైనామా దరఖాస్తులు, ప్రజావాణి, భూసేకరణ, మీ సేవ సర్టిఫికెట్లు, సీనియర్ సిటిజన్ అర్జీలు, సమాచార హక్కు చట్టం దరఖాస్తులు, రైతు ఆత్మహత్యల కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు.

# దద్దుర్లు, పాక్షిక బలహీనత కేసుల సమాచారాన్ని వెంటనే ఇవ్వాలి

- మీజిల్స్-రూబెల్లా, పోలియో నియంత్రణకు అప్రమత్తత అవసరం
- పిల్లల వైద్య నిపుణులతో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ సమీక్ష
- ఈ నెల 28న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని పిలుపు



అక్షరదర్బార్, హనుమకొండ: మీజిల్స్, రూబెల్లా, పోలియో వ్యాధుల నియంత్రణలో భాగంగా జ్వరంతో పాటు దద్దుర్లు ఉన్న పిల్లలు లేదా 15 సంవత్సరాల లోపు పిల్లల్లో శరీరంలోని ఏ భాగమైన పాక్షికంగా బలహీనపడినట్లు గుర్తిస్తే వారి పూర్తి వివరాలను వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ సూచించారు. మీజిల్స్-రూబెల్లా సర్వేలెన్స్ (నిఘా) కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన పిల్లల వైద్య నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు అందుతున్నప్పటికీ అప్పుడప్పుడు మీజిల్స్, రూబెల్లా అనుమానిత లక్షణాలు కలిగిన కేసులు కనిపిస్తున్నాయని తెలిపారు. జ్వరం, దద్దుర్లు ఉన్న పిల్లల సమాచారం అందితే వారి నుంచి నమూనాలు సేకరించి పరీక్షల కోసం పంపిస్తామని, ఫలితాలు పాజిటివ్‌గా వస్తే సంబంధిత ప్రాంతాల్లో వెంటనే నివారణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ వైద్యులు కూడా భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పరకాల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, పిల్లల వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. రమేష్, కోశాధికారి డాక్టర్ అన్వేషిని, డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ రజిత, డాక్టర్ మురళి, జీఎంహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మానస నరహరి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రుబీనా, డెమో వి. అశోక్ రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్ స్వాధీనం
- నిందితుడిపై కేసు నమోదు : ఎస్సై సాంబమూర్తి

అక్షరదర్బార్, మహదేవపూర్: మహదేవపూర్ మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మహదేవపూర్ ఎస్సై సాంబమూర్తి సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మహదేవపూర్ గ్రామ పరిధిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ గోగుల ప్రసాద్ (తండ్రి వెంకటయ్య) కుదురుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు పరిశీలించగా ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేవని తేలింది. దీంతో ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై ఎం. సాంబమూర్తి తెలిపారు.

# అమెరికా వాణిజ్య ఒప్పందాలతో దేశీయ వ్యవసాయం దివాలా

- హైదరాబాద్ రోడ్డుకు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడం సిగ్గుచేటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ధ్వజం
- వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ఘనంగా నిరసన




అక్షరదర్బార్, వరంగల్: ప్రపంచ అశాంతికి, ధరల పెరుగుదలకు కారణభూతమైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాదులోని అమెరికా కాన్సులేట్ అవెన్యూ ఆఫీస్ ప్రధాన రహదారికి నామకరణం చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మంగళవారం ఎంసిపిఐ(యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్ రాంగూడలోని అమెరికా కన్సలెట్జెన్సీ ఆఫీస్ రోడ్డుకు డోనాల్డ్ ట్రంప్ పేరును పెట్టడాన్ని నిరసిస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ట్రంపుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ నగర కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పేరుకు ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని ప్రచార ఆర్భాటం చేస్తూ, ఆచరణలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు వంత పాడుతున్నాయని విమర్శించారు. ప్రపంచాన్ని తన కబంధహస్తాల్లో బంధించాలని చూస్తున్న అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలకు దాసోహం అయ్యారని మండిపడ్డారు. ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెడుతూ అశాంతిని రగిలిస్తూ పెత్తందారి పోకడలతో ప్రజల ప్రాణాలను బలికొంటున్న ట్రంప్, మరోవైపు ధరల పెరుగుదలకు ప్రధాన కారకుడు అయ్యాడని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో అనేకమంది త్యాగధనుల ఫలితంగా స్వాతంత్రం, తెలంగాణ విముక్తి జరిగిందని, అలాంటి మహానుభావుల పేర్లను ఎక్కడా నామకరణం చేయకుండా దేశ ప్రజలకు హాని కలిగించే వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూ ట్రంప్ పేరును హైదరాబాదు మహానగరంలోని రోడ్డుకు పెడతామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి పద్ధతులను మానుకొని రాష్ట్ర, దేశ చరిత్రను కాపాడాలని, లేకపోతే తగిన విధమైన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, సుంచు జగదీశ్వర్, జిల్లా నగర నాయకులు ఎగ్గెని మల్లికార్జున్, అప్పనపురి నర్సయ్య, గణిపాక ఓదేలు, మాలి ప్రభాకర్, నలివెల రవి, బిట్ల సమ్మయ్య, రాయినేని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యపై ఉపకులాలు దృష్టి సారించాలి

- పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధన
- వర్గీకరణ ఫలితాలు పొందాలన్న మడిపల్లి శ్యామ్ మాదిగ

అక్షరదర్బార్, మహాదేవపూర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అధ్యక్షతన ముఖ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యామ్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా జరిగిన పోరాటాల ఫలితమే నేడు ఉపకులాలకు అందుబాటులోకి వచ్చిన వర్గీకరణ అని అన్నారు. మందకృష్ణ మాదిగ చేపట్టిన 'గోటు విలేజ్' కార్యక్రమం ద్వారా మాదిగలు విద్యారంగంలో ముందంజలో నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని ఎస్సీ ఉపకులాల ప్రజలు వర్గీకరణ ఫలితాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరపు నరేష్, టౌన్ అధ్యక్షుడు చింతకుంట్ల సదానందం, సీనియర్ నాయకులు నల్లబుగ్గ ధర్మయ్య, చింతకుంట్ల రాందాస్, చింతకుంట్ల రాము, లింగాల సుశాంత్, చింతకుంట్ల సాయి, లింగాల సుదర్శన్, చింతకుంట్ల సతీష్, కొలుగూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# గాలి వాన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర

- భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో పర్యటన
- బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.2 లక్షల ఆర్థిక సాయం హామీ
- సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం



అక్షరదర్బార్, జయశంకర్ భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9, 10వ వార్డుల్లో గాలి వాన కారణంగా దెబ్బతిన్న ఇళ్లను, పూరిగుడిసెలను, చెట్లు విరిగి పడిన ప్రాంతాలను మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడిన ఎమ్మెల్యే జరిగిన నష్టంపై వివరాలు తెలుసుకొని, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను వెంటనే సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గాలి వానకి ఇంటి పైకప్పులు పూర్తిగా దెబ్బతిన్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు పథకం కింద రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రెవిన్యూ, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

## వర్షా లుకురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

### వర్షా ల్లేక మొలకెత్తని విత్తనాలు.. ఆందోళనలో రైతాంగం

### కొత్తగట్టు సింగారంలో ప్రత్యేక పూజలు చేసిన గ్రామస్తులు



అక్షరదర్బార్, శాయంపేట: విస్తారంగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు నిండి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామంలో గ్రామస్థులు గ్రామ దేవతలకు ఘనంగా జలాభిషేకం చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా సకాలంలో వర్షాలు పడకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వర్ష దేవుడి కరుణ కోసం గ్రామస్తులంతా కలిసి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొత్తగట్టు సాయి, కూకిడి రాజేందర్, సత్తన్న, శ్యాం రావు, టెకుంరాల రఘు తదితరులు పాల్గొన్నారు.

# నడికూడలో గ్రామసభ వాయిదా

- అధికారుల సమక్షంలోనే విచారణ జరపాలని గ్రామస్తుల డిమాండ్
- నిధుల విడుదలలో అవకతవకలపై తేల్చాల్సిందే..
- ఫిర్యాదు అందితే విచారణ జరుపుతామన్న ఎంపీడీవో

అక్షరదర్బార్, నడికూడ: గ్రామపంచాయతీ నిధుల విడుదలలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మంగళవారం నిర్వహించాల్సిన గ్రామసభ మండల అధికారుల గైర్హాజరుతో వాయిదా పడింది. అధికారులు హాజరైన రోజే గ్రామసభ నిర్వహించి, అన్ని లెక్కలను వారి సమక్షంలో ప్రజలకు వెల్లడించాలని గ్రామస్థులు, పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో భారీ అక్రమాలు జరిగాయని, నకిలీ బిల్లుల ఆధారంగా పంచాయతీ అధికారి, సర్పంచ్ నిధులు డ్రా చేశారని గ్రామ పాలకవర్గ సభ్యులు ఇటీవల పత్రికా ప్రకటన ద్వారా ఆరోపించారు. ఈ అంశంపై చర్చించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే విచారణకు సంబంధించి మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల సమక్షంలోనే ప్రతి లెక్కను పరిశీలించాలని పట్టుబట్టారు. దీంతో ప్రజల డిమాండ్ మేరకు గ్రామపంచాయతీ అధికారి గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో అధికారుల అనుమతితో మరో తేదీ నిర్ణయించి గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు.

**ఫిర్యాదు అందితే విచారణ**

గ్రామసభ ఏర్పాటుపై ఎంపీడీవోను వివరణ కోరగా, గ్రామపంచాయతీ నిధుల అవకతవకలపై నడికూడ గ్రామపంచాయతీ పాలకవర్గం నుంచి మండల అధికారులకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందితే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే గ్రామసభ నిర్వహణకు సంబంధించి తమ కార్యాలయానికి ముందస్తు సమాచారం ఇవ్వలేదని వెల్లడించారు.

### చెరువు శిఖం ఆక్రమణలతో

# జీవనోపాధికి ముప్పు

**హద్దులు నిర్ణయించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి**

**అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదు**

ముదిరాజ్ సంఘం చైర్మన్ తాళ్ల శ్యామ్‌రాజ్ ముదిరాజ్ ఆవేదన



అక్షరదర్బార్, నడికూడ: నడికూడ గ్రామ ముదిరాజ్ సంఘానికి చెందిన పెద్ద చెరువు సహా సొసైటీ పరిధిలోని చెరువులు, కుంటల్లో శిఖం భూములను కొందరు ఆక్రమిస్తున్నారని సంఘం చైర్మన్ తాళ్ల శ్యామ్‌రాజ్ ముదిరాజ్ ఆరోపించారు. శిఖం భూముల్లో అక్రమంగా బావులు తవ్వడం, మట్టి తరలించడం, ఆక్రమణలు చేపట్టడం వల్ల ముదిరాజ్ సంఘం సభ్యుల జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యపై గత ఏడాది నుంచి పలుమార్లు తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల హద్దులను సత్వరమే గుర్తించి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుని తమ జీవనోపాధిని కాపాడాలని ముదిరాజ్ సంఘం తరఫున ప్రభుత్వాన్ని కోరారు.

## రైతువేదికల్లో ఘనంగా 'సీడ్ మేళా'

అక్షర దర్బార్ మల్హర్ : మండలంలోని తాడిచర్ల, కొయ్యూరు రైతువేదికలలో ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "సీడ్ మేళా" కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. కొయ్యూరు గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో రైతులకు ప్రభుత్వం గుర్తించిన 7 సన్న రకాల నాణ్యమైన బోనస్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. రైతులు ధ్రువీకరించిన విత్తనాలను సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సాగు వ్యయాన్ని తగ్గించే నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగం, వాటి ప్రాధాన్యతపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పృథ్వీరాజ్, అనూష, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి**

**జిల్లా సంక్షేమ అధికారిణి ఇ.పి. ప్రేమలత పిలుపు**

**ములుగు జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు**




అక్షరదర్బార్, ములుగు: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలలో ప్రిన్సిపాల్ నర్మద అధ్యక్షతన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి ఇ.పి. ప్రేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, బాలలందరూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో విద్య పట్ల ఆసక్తితో ఉత్తమ పౌరులుగా ఎదగాలని, క్రమశిక్షణతో శ్రమించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అంతేకాకుండా ఈరోజు జిల్లావ్యాప్తంగా చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజెస్‌గా గుర్తించబడిన 26 గ్రామ పంచాయతీలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డిసిపియు), సఖి కేంద్రం (సఖి), చైల్డ్ హెల్ప్ లైన్, ఉమెన్ హబ్ (హెచ్ యు బి) విభాగాల సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం మూల స్థాయికి వ్యాపించకుండా ప్రజల్లో చైతన్యం కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి, ములుగు ఎస్సై-2 ఇమ్మానుయేల్, నషా ముక్త్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ఎఫ్ఆర్ఓ గణేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ను తనిఖీ చేసిన కలెక్టర్

అక్షర దర్బార్ వెంకటాపూర్ : ములుగు జిల్లా కలెక్టర్ భోర్కాడే హేమంత్ సహదేవరావు వెంకటాపూర్ మండలంలోని మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని రికార్డును, ల్యాబ్ పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు తెలియజేశారు. విద్యార్థుల హాజరు నమోదు శాతాన్ని పెంచేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కృష్ణ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

అక్షర దర్బార్ చిట్యాల : విద్యార్థులు చెడు అలవాట్లకి దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపినట్లయితే జీవితంలో ఎన్నో విజయాలు అందుకొని ఉన్నత స్థాయిలో నిలుస్తారని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ అన్నారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని వెలుగు గురుకుల బాలికల పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చిట్యాల్ సబ్ ఇన్స్పెక్టర్ పోచంపల్లి సతీష్ గారు ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై వ్యాసరచన, పోటీలు నిర్వహించడం జరిగింది అనంతరం విద్యార్థినులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోస్టర్లను ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బిక్షపతి, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.



### మొగుళ్ళపల్లి, పర్లపల్లి

## రైతు వేదికల్లో 'విత్తన మేళా'

- వానాకాలం సీజన్‌కు 7 రకాల సన్న వరి విత్తనాల పంపిణీ
- 30 వరకు విక్రయాలు

అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: మొగుళ్ళపల్లి, పర్లపల్లి రైతు వేదికల్లో వానాకాలం సీజన్‌కు సంబంధించి 'విత్తన మేళా' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ మేళా ఈ నెల 30 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్, పిఎసిఎస్ చైర్మన్ ఎస్. నర్సింగ రావు, ఏఎంసి వైస్ చైర్మన్ ఎం.డి. రఫీ, సర్పంచులు క్యాతరాజు కవిత-లింగమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరి సాగుకు అనువైన BPT-5204, KNM-1638, RNR-15048, HMT Sona, జై శ్రీరామ్, WGL-44, KNM-7715 రకాల సన్న విత్తనాలను రైతులకు అందజేశారు. అనంతరం నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు ధ్రువీకరించిన విత్తనాలను వాడి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.






# సన్న వడ్లు సాగు చేయండి

- వాణిజ్య పంటలతోనే రైతులకు ఎక్కువ లాభాలు
- త్వరలోనే రైతుబంధు సాయం అందిస్తాం
- ఎమ్మెల్యే గండ్ర

అక్షరదర్బార్, శాయంపేట: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రైతులు సన్న వడ్ల బోనస్‌కు అర్హత కలిగిన 8 రకాల వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. శాయంపేట మండల రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో మొక్కజొన్న అధికంగా సాగు అవుతున్న నేపథ్యంలో, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పత్తి, మిరప, కందులు, పెసలు వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ అమలు చేసిందని, త్వరలోనే రైతుబంధు సాయాన్ని కూడా అందజేస్తామని స్పష్టం చేశారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.